# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భవిష్యత్‌ను భద్రపరచుకోవడానికి నీటి సంరక్షణను మనందరి జీవితాల్లో ఒక భాగంగా చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం తమిళనాడులో 5 వేల 650 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.
- గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌పై 60 రూపాయలు పెంచుతూ.. దేశీయ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి.
- ఛత్తీస్‌గఢ్ లో 108 మంది మావోయిస్టులు ఈరోజు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్‌ను భద్రపరచుకోవడానికి, నీటి సంరక్షణను మనందరి జీవితాల్లో ఒక భాగంగా చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన “జల్ మహోత్సవ్ 2026”లో రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో నీరు కేవలం ఒక ప్రాథమిక సౌకర్యం మాత్రమే కాదని.. అది మన సంస్కృతి, సంప్రదాయాలు, సమాజ జీవితంతో ముడిపడి ఉందని అన్నారు. గతంలో మహిళలు చాలా దూర ప్రాంతాల నుండి తాగునీటిని తీసుకురావాల్సి వచ్చేదని ఇటువంటి సవాళ్లను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం `జల్ జీవన్ మిషన్`ను ప్రారంభించిందన్నారు. పరిశుభ్రమైన నీటిని అందించడం కేవలం సౌకర్యం మాత్రమే కాదని అది ఆరోగ్యం, గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. నేడు గ్రామీణులు కూడా తమ ఇళ్లలోనే సురక్షితమైన నీటిని పొందుతున్నారని తెలియజేశారు. నీటి సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పౌర సమాజం కూడా దీనిని పాటించాలని రాష్ట్రపతి స్పష్టం చేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం తమిళనాడులో 5 వేల 650 కోట్ల రూపాయల విలువ గల పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రెండు అమృత్ భారత ఎక్స్ ప్రెస్ రైళ్లు, రెండు సాధారణ ఎక్స్ ప్రెస్ రైళ్లు, ఒక పాసింజర్ రైలు సహా 5 కొత్త రైలు సేవలను ప్రధానమంత్రి ప్రారంభించారు. నీలగిరి, ఈరోడ్ జిల్లాల్లో 3 వేల 680 కోట్ల రూపాయల ఖర్చుతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కు చెందిన సిటీ గ్యాస్ డిస్ట్రిబిషన్ నెట్ వర్క్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టులు ఇందన అనుసంధానాన్ని మెరుగుపరిచేవి మాత్రమే కాదని తమిళనాడు యువతకు వేలాది ఉపాధి అవకాశాలను కల్పించేవన్నారు.

(వాయిస్ 31 సెకన్లు)

అంతకుముందు కేరళంలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్నాకుళంలో దాదాపు 11 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) కొచ్చి రిఫైనరీలో పాలీప్రొపైలిన్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలో దాదాపు 50 ఏళ్ల తర్వాత మొదటి భారీ చమురు రిఫైనరీ `అమెరికా ఫస్ట్ రిఫైనింగ్` ప్రారంభించేందుకు భారతదేశానికి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌తో చారిత్రాత్మకమైన 300 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ వేదికగా ఈరోజు ప్రకటించారు. ఇది అమెరికా ఇంధన రంగానికి ఒక మైలురాయి లాంటి ఒప్పందమని అభివర్ణించారు. టెక్సాస్‌లోని పోర్ట్ ఆఫ్ బ్రౌన్స్‌విల్లేలో ఏర్పాటు కానున్న ఈ సౌకర్యం.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్ లో 108 మంది మావోయిస్టులు ఈరోజు పోలీసులు ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ, సుక్మా, బస్తర్, నారాయణపూర్, కాంకేర్ జిల్లాలలో గత కొద్ది సంవత్సరాలుగా క్రియాశీలకంగా ఉన్న 108 మంది నక్సలైట్లు బస్తర్ డివిజన్ లోని జగదల్పూర్ పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట ఆయుదాలతో లొంగిపోయారు. వీరిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని, వీరందరిపై 3.95 కోట్ల రూపాయల రివార్డు ఉందని హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ దిగుమతి చేసుకుంటున్న 70 శాతానికి పైగా ముడిచమురు దిగుమతులు హోర్ముజ్ జలసంధి ద్వారా కాకుండా ఇతర మార్గాలలో వస్తున్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితులపై అంతర మంత్రిత్వ శాఖల పాత్రికేయుల సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో సుజాత శర్మ మాట్లాడుతూ... భారత్ లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఇంధన ధరలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్నాయని.. అందువల్లనే గృహవినియోగ ఎల్.పీ.జీ. సిలిండర్‌పై 60 రూపాయలు, కమర్షియల్ సిలిండర్‌పై 115 రూపాయలు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయని చెప్పారు. పెరిగిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి రానున్నాయని.. ఉజ్వల్ పథకం ద్వారా అందించే సిలిండర్ ధరల్లో మాత్రం మార్పు లేదని ఆమె స్పష్టం చేస్తూ...

[వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతోంది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ ఈరోజు డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో పలువురు గాయపడగా.. అందులో భారతీయు కూడా ఉన్నారు. ఈ ఘటనపై అంతర మంత్రిత్వ శాఖల పాత్రికేయుల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. గల్ఫ్ సహకార మండలి (GCC) దేశాలలో దాదాపు కోటి మంది భారతీయ సమాజం వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. GCC ప్రాంతంలో ఈరోజు చోటు చేసుకున్న విమానాశ్రయ దాడిలో గాయపడ్డ భారతీయులకు చికిత్స అందిస్తున్నారని, వారి శ్రేయస్సును నిర్ధారించడానికి భారత రాయబార కార్యాలయం ఎప్పటికప్పుడు వారితో సంప్రదిస్తోందని చెప్పారు. భారత్ వైపుగా వస్తోన్న చమురు నౌకపై కూడా దాడి జరిగిందని, ఈ దాడిలో ఇద్దరు మరణించారని రణధీర్ జైస్వాల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 17 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీతి ఆయోగ్ ఆర్థిక ఆరోగ్య సూచిక (ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్) 2026 రెండవ వార్షిక సంచికను న్యూఢిల్లీలో ఈరోజు విడుదల చేసింది. రాష్ట్రాలలో ఆర్థిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడానికి ఈ నివేదిక అనేక విధాన ప్రాధాన్యతలను ప్రస్తావించింది. ఆదాయ సమీకరణను పెంచడం, ప్రభుత్వ యాజమాన్యంలోని పన్ను సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక సరళతను పునరుద్ధరించడానికి కట్టుబడి ఉన్న వ్యయాలను హేతుబద్ధీకరించడం, మూలధన వ్యయం కూర్పు మొదలగు అంశాలు వీటిలో ప్రధానంగా ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ `కవచ్` పనులు వేగంగా జరుగుతున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. కవచ్ అనేది ఐదు ఉప-వ్యవస్థలతో కూడిన అత్యంత క్లిష్టమైన వ్యవస్థ అని అన్నారు. 8 వేల 570 కిల మీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ లో భాగంగా భారత్, వేల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ ను డ్రా చేసుకున్నా భారత్ సెమీఫైనల్ కు చేరుకుంటుంది. ఇప్పటికే రెండు గోల్స్ చేసి భారత్ ఆధిక్యం ప్రదర్శిస్తోంది. భారత్ ప్రస్తుతం రెండు మ్యాచ్ ల్లో నాలుగు పాయింట్లతో పూల్ -బీలో అగ్రస్థానంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =